క్లుప్తంగా

మల్టిపుల్ సెర్లోసిస్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు /ఏలూరు (టూటౌన్) : మల్టిపుల్ స్కెర్లోసిస్ అనేది స్వయం ప్రతిరక్షక వ్యాధి, ఇది కేంద్ర నాడీ వ్యవస్థను మెదడు వెన్నుపామును నిలిపివేయగలుగుతుందని మాదేపల్లి పీహెచ్‌సీ ఎంపీహెచ్ఈఓ కె.ఉమామహేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి పీహెచ్‌సీలో ఉమా ఎడ్యుకేషన్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం మల్టిపుల్ స్కెర్లోసిస్ దినోత్సవ సందర్భంగా అవగాహన సమావేశం నిర్వహించారు. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మైలిన్ కోసం అనేది నరాల ఫైబర్ల చుట్టూ ఉన్న కొవ్వు కవచం, ఇది నాడీ కణాల వెంట విద్యుత్ ప్రారంభం త్వరగా సమర్థవంతంగా ప్రసారం చేయడంలో సహాయపడుతుందన్నారు. సంస్థ కోఆర్డినేటర్ డి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తమ దివ్యాంగుల పునరావాస కేంద్రంలో ఫిజియోథెరపీ, ఆడియో లాజి, స్పీచ్ థెరపీ లాంగ్వేజ్ థెరపీ, సైకలాజికల్ సేవలు కృత్రిమ అవయవాలు అందిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ నెంబర్లు 0881249297, 7386565469లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు హాస్య కార్యకర్తలు గ్రామస్తులు ఉన్నారు.

బదిలీ అయిన హెచ్‌ఎంలు వీరే

దెందులూరు: సాధారణ బదిలీల్లో భాగంగా ఏలూరు రూరల్ మండలానికి ముగ్గురు ప్రధానోపాధ్యాయులు వచ్చారని ఏలూరు మండల విద్యాశాఖ అధికారి దేవినేని వెంకటరమణ తెలిపారు. ఈ వివరాలను శుక్రవారం ఎంఈఓ కార్యాలయంలో ఆయన వెల్లడించారు. చాటపర్రు ఉన్నత పాఠశాలకు వి.మురళీకృష్ణ, గుడివాకలంక ఉన్నత పాఠశాలకు బి.శ్రీనివాసరావు, పోణంగి ఉన్నత పాఠశాలకు పీడీ విజయకుమార్ హెచ్‌ఎంగా నియమితులయ్యారని వివరించారు.

అహల్యాబాయికి ఘన నివాళి

ఏలూరు (టూటౌన్): మహారాణి అహల్యాబాయి హోల్కర్ త్రిశతాబ్ది జయంతి వేడుకలను ఏలూరులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీఎస్ఆర్ చౌదరి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ ఆర్ అప్పలనాయుడు తదితరులు ఆమెకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె సేవా స్ఫూర్తిని పలువురు కొనియాడారు. బీజేపీ నేతలు నిర్మల కిషోర్, విక్రమ్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

బడుగు విద్యార్థుల భవిత ప్రశ్నార్థకం

- తల్లికి వందనం ఎప్పుడో?
- పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు దిక్కులేదు
- నిలిచిన నాడు – నేడు పనులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు నియోజకవర్గంలో బడుగు విద్యార్థుల భవిత ప్రశ్నార్థకంగా మారింది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన విద్యా సంస్కరణలతో పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు గత ఐదేళ్లలో ఉన్నత చదువులు చదివి మంచి మంచి స్థానాల్లో, మంచి స్థాయిల్లో స్థిరపడ్డారు. ఉన్నత చదువులకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయనక్కరలేకుండా మొత్తం ప్రభుత్వం నుంచే నిధులు విడుదల చేసి పేదల చదువులు నిరాటంకంగా కొనసాగడానికి బంగారు మార్గాన్ని పరిచారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన ఆయా విద్యారంగ పథకాలతో విద్యార్థులు అంచెలంచెలుగా ఎదిగి మరి కొందరికి మార్గదర్శకంగా నిలిచారు. ఈ క్రమంలో ఆర్థిక భారం కారణంగా చదువు మధ్యలో మానేసిన అనేక మంది సైతం ఆయా పథకాల ప్రోత్సాహంతో తిరిగి అభ్యాసం ప్రారంభించి, దిగ్విజయంగా పూర్తి చేసిన వారున్నారు. ఆయా పథకాలు వర్తిస్తాయని చదువు కొనసాగిస్తున్న బడుగు, బలహీన వర్గాల పిల్లల భవిత నేటి కూటమి విధానాలు, వైఫల్యాలతో అటకెక్కే ప్రమాదంలో పడింది. కేవలం సంక్షేమ పథకాల ఆసరాతోనే చదువును కొనసాగించే పేద విద్యార్థులకు గత ఏడాది ప్రతి రోజూ కాళరాత్రిగా మారింది. ఫీజుల డబ్బులు పడతాయని ఎదురు చూడడం, కళాశాలల యాజమాన్యాల నుంచి బెదిరింపులు ఎదుర్కోవడం వంటి అనేక కష్టాలతో పేద విద్యార్థులు విద్య అస్తవ్యస్తంగా మారింది.



నాడు - నేడు నిధులతో సర్వాంగ సుందరంగా తయారైన శనివారపు పేట హైస్కూల్



నేడు నిధులతో విద్యార్థులకు సమకూర్చిన బెంచీలు



నిధులు నిలిపివేయడంతో మధ్యలోనే నిలిచిన శ్రీ కృష్ణదేవరాయ పాఠశాల తరగతి గదుల నిర్మాణం

నాడు నిరాటంకంగా అమ్మ ఒడి

గత ప్రభుత్వంలో అమ్మఒడి పథకం నిరాటంకంగా ప్రతి ఏటా అమలు చేశారు. ఏలూరు నియోజకవర్గంలో 18,835 మంది విద్యార్థుల తల్లులకు ఏటా రూ.28.25 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశారు. 2024 – 2025 విద్యా సంవత్సరంలో మాత్రం తల్లులకు నిరాశే ఎదురైంది. అప్పట్లో ఇంటికి ఒక విద్యార్థి చొప్పున అమ్మ ఒడి పథకాన్ని అమలు చేయగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రతి విద్యార్థికీ తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చిన మేరకు ఇద్దరు, ముగ్గురు పిల్లలు ఉన్న తల్లులు తమకు ఏడాదికి కనీసం రూ.30 వేలు వస్తుందని ఆశించారు. ఈ లెక్కన ఏలూరు నియోజకవర్గంలో గత విద్యా సంవత్సరంలో మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపల్ కార్పొరేషన్, ఎయిడెడ్, ప్రైవేట్ యాజమాన్యాల పాఠశాలల్లో 47,824 మంది విద్యాభ్యాసం చేశారు. దీని ప్రకారం ప్రభుత్వం ఆయా విద్యార్థుల తల్లులకు రూ.71.73 కోట్లు జమ చెల్లించాల్సి ఉంది.

ఫీజుల కోసం అప్పులపాలు

గత ప్రభుత్వంలో ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌గా జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పథకాలను అమలు చేశారు. ఒక్క ఏలూరు నియోజకవర్గంలోనే ఉన్నత విద్యకు సంబంధించి సీఆర్ఆర్ అటానమస్, సీఆర్ఆర్ పీజీ, సీఆర్ఆర్ ఇంజినీరింగ్, తదితర కళాశాలలతో పాటు రామచంద్ర ఇంజినీరింగ్, ఏలూరు ఇంజినీరింగ్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆదిత్య, ఎస్ఆర్ఐ డిగ్రీ కళాశాలల తదితర కళాశాలల్లో సుమారు 8 వేలకు పైగా విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ ఆయా చదువు, కళాశాలల స్థాయిలను బట్టి జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాల కింద రూ.51 కోట్లు జమ చేసింది గత ప్రభుత్వం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వారికి ఒక్క రూపాయి కూడా జమ చేయకపోవడంతో అన్నేసి వేల రూపాయలు ఎలా కట్టాలో తెలియక, కళాశాలల యాజమాన్యాల ఒత్తిడి తట్టుకోలేక ఎంతోమంది చదువును ఆపేయాలనే నిర్ణయానికి వచ్చినా ఎక్కడో చిన్న ఆశతో అప్పులు చేసి ఫీజులు చెల్లించారు.

హామీలన్నీ అమలు చేయాలి



పాఠశాలలను అభివృద్ధి చేయడం ద్వారానే విద్యార్థులను పాఠశాలలకు రప్పించడం సాధ్యమౌతుంది. గత ప్రభుత్వంలో కోట్లాది రూపాయలు పాఠశాలల అభివృద్ధికి వెచ్చించారు. ఈ ప్రభుత్వం ఎందుకు నిధులు విడుదల చేయడం లేదు? పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలి. ముఖ్యంగా తల్లికి వందనం నిధులు వెంటనే ఖాతాల్లో జమ చేయాలి.

– ఎస్ జీవన్ కుమార్, పీఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



నేను ఏలూరులో ఫార్మసీ చదువుతున్నాను. గతంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు ప్రతి త్రైమాసికానికి విడుదల చేసేవారు. విడుదల చేసిన సొమ్మును కళాశాలకు చెల్లించేవాళ్లం. కానీ గత ఏడాది కాలంలో ఒక్క త్రైమాసికానికి కూడా నిధులు విడుదల చేయకపోవడంతో అప్పుచేసి ఫీజులు చెల్లించాల్సి వచ్చింది. పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ నిధులు వెంటనే విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలి.

– ఎం యశ్వంత్, ఫార్మసీ విద్యార్థి

గత ప్రభుత్వంలో కార్పొరేట్‌ను తలపించేలా స్కూళ్లు

విద్యార్థులకు కార్పొరేట్ స్కూల్స్‌లో చదువుతున్నామనిపించేలా పాఠశాలలను గత ప్రభుత్వం నాడు – నేడు పథకంతో అత్యంత సుందరంగా తీర్చిదిద్దింది. తరగతి గదుల్లో అత్యాధునిక సౌకర్యాలు, గ్రీన్ చాకోబోర్డులు, మరుగుదొడ్లలో ఆధునిక సౌకర్యాలు, తాగునీటికి ఆర్ఓ వాటర్ ప్లాంట్లు, పాఠశాలలకు ఆకర్షణీయమైన బొమ్మలు ఇలా అనేక సొబగులద్ది విద్యార్థులకు ఆరోగ్యకర వాతావరణం అందుబాటులోకి తెచ్చారు. ఒక్క ఏలూరు నియోజకవర్గంలోనే రెండో విడత నాడు – నేడు పనులకు 63 పాఠశాలలను ఎంపిక చేశారు. వాటిని సుమారు రూ.25 కోట్లతో అభివృద్ధి చేయడానికి నిధులు మంజూరు చేశారు. అయితే గత ప్రభుత్వంలో రూ.4.68 కోట్లతో పనులు పూర్తి చేశారు. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆయా పనులకు నిధులు విడుదల చేయకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయి, అప్పటి వరకు ఖర్చు పెట్టిన నిధులు వృథా అయ్యాయి.

క్షేత్రానికి భారీగా కాలి నడక భక్తులు



క్షేత్రానికి చేరుకుంటున్న భక్తులు

ద్వారకాతిరుమల: ఓ పక్క చిమ్మ చీకటి.. మరో పక్క వర్షం. అయినా వాటిని లెక్క చేయకుండా శ్రీవారి క్షేత్రానికి పాదయాత్ర భక్తులు శుక్రవారం రాత్రి పోటెత్తారు. దీంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. రాజమండ్రి, కొవ్వూరు, నిడదవోలు, తణుకు, తాడేపల్లిగూడెం, భీమవరం, గణపవరం పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు దూబచర్ల–అయ్యవరం మీదుగా కొండపైకి చేరుకున్నారు. అలాగే ఉయ్యూరు, గుడివాడ, ఏలూరు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు భీమడోలు, అదేవిధంగా ఆడమెల్లి–వెంకటకృష్ణాపురం నుంచి స్థానిక నృసింహసాగరం మీదుగా క్షేత్రానికి చేరుకున్నారు. కాలినడక మార్గాల్లో వీధి లైట్లు లేక భక్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. సెల్ ఫోన్ లైట్ల వెలుగుల్లో క్షేత్రానికి చేరుకున్నారు. పాదయాత్ర భక్తులకు దేవస్థానం సిబ్బంది ఉచిత అన్న ప్రసాదాన్ని, ఉచిత దర్శనం టికెట్లను అందజేశారు. శనివారం ఉదయం వీరంతా స్వామి, అమ్మవార్లను దర్శించుకోనున్నారు.

వాటర్ డిస్పెన్సర్ బహూకరణ

కొయ్యలగూడెం: బయ్యనగూడెం గ్రామ దేవత శ్రీపతువులమ్మ ఆలయానికి దాతలు స్టాండింగ్ కూలింగ్ క్యాబినెట్ బాటిల్ వాటర్ డిస్పెన్సర్‌ను శుక్రవారం విరాళంగా అందజేశారు. మద్దు తేజ విశ్వనాథ్, ఆరేటి ఏసుబాబు, బాలం నరేష్, కటికి రాధాకృష్ణ, పారేపల్లి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

పాలగుడెంలో ఫ్రైడే – డ్రై డే ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు: దోమల వృద్ధిని అరికట్టాలంటే ప్రతి ఒక్కరు ఫ్రైడే డ్రైడే పాటించాలని జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్ సూచించారు. శుక్రవారం ఏలూరు రూరల్ మండలం చాటపర్రు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పాలగూడెం గ్రామంలో ఫ్రైడే – డ్రై డే కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. అక్కడ ప్రజలతో మాట్లాడారు. వాతావరణంలో మార్పుల వల్ల జ్వరాలు, ఇతర అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. అపరిశుభ్ర పరిసరాల వల్ల దోమలు ఎక్కువగా వృద్ధి చెంది డెంగీ, మలేరియా, చికున్ గున్యా వంటి వ్యాధులు సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజల భాగస్వామ్యంతోనే దోమల ద్వారా వచ్చే వ్యాధులు అరికట్టుకోవచ్చని అన్నారు. నీరు నిల్వ ఉండకుండా వారానికి ఒకసారి శుభ్రపరచుకొని, మూతలు పెట్టుకోవాలని, నీటి నిల్వ ప్రాంతాల్లో వాడేసిన ఇంజిన్ ఆయిల్ చల్లాలని సాయంత్రం సమయంలో కిటికీలు వేసుకోవాలని, దోమతెరలు వాడాలని, వేపాకు పొగ వేసుకోవాలని సూచించారు. ప్రజలు మురికి కాలువలో చెత్త వేయరాదన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. డెంగీ, మలేరియాపై ముద్రించిన కరపత్రాలను ప్రజలకు పంచారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు, వైద్య సిబ్బంది ఉన్నారు.

క్షయ నివారణకు చర్యలు

ఏలూరు(మెట్రో): క్షయ రహిత సమాజం అందరి లక్ష్యం కావాలని, ఇందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లో టీబీ ముక్త్ భారత్ ప్రచార కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధి నిర్మూలన అవగాహన పోస్టర్లను, కరపత్రాలను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షయ పోషణ అభియాన్ కింద క్షయ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేస్తారని తెలిపారు. వ్యాధిపై అపోహలు వీడి తగు జాగ్రత్తలు తీసుకుంటే సులభంగా నయం చేయవచ్చన్నారు. డీఎంహెచ్ఓ ఆర్.మాలిని, డీఐఓ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యోగా రిజిస్ట్రేషన్లు వేగిరపర్చాలి

జిల్లావ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు జరుగుతున్నాయని, జిల్లాలో దాదాపు 8 లక్షల మందికి యోగాను చేరువ చేసేందుకు కృషిచేస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే 4.18 లక్షల మంది తమ పేర్లు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారన్నారు. అలాగే 6,226 మంది శిక్షకులు నమోదయ్యారన్నారు. యోగా రిజిస్ట్రేషన్లు వేగిరపర్చాలని అధికారులను ఆదేశించారు.

మహిళ అదృశ్యంపై కేసు

ఏలూరు టౌన్: దెందులూరు మండలం కొవ్వలి గ్రామానికి చెందిన దంపతులు ఏలూరు నగరానికి బ్యాంకు పని కోసం వచ్చారు. అనంతరం మహిళ కనిపించకపోవటంతో టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కొవ్వలి గ్రామానికి చెందిన గౌతమికి, మండవల్లి మండలం కొత్తచెరువు గ్రామానికి చెందిన మామిడి శివ సత్యవర ప్రసాద్‌కు నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. భార్యభర్త మ ధ్య గొడవలు రావటంతో గౌతమి పుట్టింటికి వచ్చేసింది. గ్రామ పెద్దల మధ్య కుటుంబ వివాదాన్ని ప రిష్కరించుకునేందుకు ప్రసాద్ కొవ్వలి గ్రామానికి శుక్రవారం వెళ్లగా సమస్య పరిష్కరించారు. ఏలూరులోని ఒక బ్యాంకులో నగదును తీసుకునేందుకు వరప్రసాద్, గౌతమి వచ్చారు. ఈ నేపథ్యంలో ఏలూరు పాతబస్టాండ్ సమీపానికి వచ్చే సరికి ఇంటివద్ద బాబు ఏడుస్తున్నాడని, అతనిని చూసి బంగారు ఆభరణాలు తీసుకుని వస్తానని చెప్పి భర్త ప్రసాద్‌ను కొత్తచెరువుకు పంపించివేసింది. అనంతరం ఆమె కనిపించకపోవటంతో సాయంత్రం భర్త ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏలూరు టూటౌన్ పోలీసులు మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అన్ని వార్డుల అభివృద్ధికీ కృషి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి. సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో అన్ని వార్డులను అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. శుక్రవారం చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ అధికారులు, పాలకవర్గం సమన్వయంతో పని చేయాలన్నారు. అప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. సమావేశంలో పలువురు సభ్యులు సమస్యలపై మాట్లాడారు. పీపీఎస్‌చంద్రరావు, చిటికెల అచ్చిరాజు మాట్లాడుతూ సంవత్సర కాలంగా వీధిలైట్లు పని చేయడం లేదని అధికారులకు మొర పెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. అయితే వీధిలైట్లు కొనుగోలు చేసి, అవి వచ్చి నెల దాటినా ఎందుకు వీధి లైట్లను పునరుద్ధరించడం లేదని నిలదీశారు. దీనిపై చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి మాట్లాడుతూ సంబంధిత అధికారులు దీనిపై చర్య తీసుకోవాలని, వీధి లైట్లు వస్తే ఎందుకు వేయడం లేదని ప్రశ్నించారు. అలాగే కంచర్ల గీతాకుమారి మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ వద్ద డ్రెయిన్ నిర్మించాలని పలు సమావేశాల్లో తాను కోరానని దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు. పీపీఎస్ చంద్రరావు, నంబూరి రామచంద్రరాజు మాట్లాడుతూ పట్టణంలో గల అల్లూరి సీతారామరాజు మున్సిపల్ పార్క్ అభివృద్ధికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని కోరారు. సంకు సురేష్ మాట్లాడుతూ వార్డుల పట్ల వివక్షత చూపిస్తున్నారని, అన్ని వార్డులు సమానంగా అభివృద్ధి చేయాలని కోరారు. మార్చిలో పెట్టిన పనులనే ఈ సమావేశంలో పెట్టారని, అయితే తన వార్డుకు సంబంధించి గతంలో పెట్టిన పనులు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. పట్టణంలో పలు వార్డుల్లో సీసీ డ్రెయిన్లు, సీసీ రోడ్లు, పైప్‌లైన్ల ఏర్పాటుకు అజెండాలో పేర్కొన్న అంశాలను సమావేశం ఆమోదిస్తూ తీర్మానించింది. వైస్ చైర్మన్లు ముప్పిడి అంజి, కంచర్ల వాసవీ రత్నం, కమిషనర్ కేవీ రమణ, ఆర్ఐ ఎస్.సుబ్బారావు, ఏఈ రాజేష్, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కోటదిబ్బ సబ్ స్టేషన్ పరిధిలో మెయిన్ బజార్ ఫీడర్ లైన్ల మరమ్మతుల నిమిత్తం జూలై 1వ తేదీ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏలూరు డివిజన్ ఈఈ కేఎం అంబేడ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. రిక్షా ఘాటి, ఏడు ఘోరీల సెంటర్, వేణుగోపాల స్వామి దేవస్థానం ప్రాంతం, విజయలక్ష్మి థియేటర్ ప్రాంతం, బుద్ధపార్క్ ప్రాంతం, పంట కాలువ రోడ్డు, టీచర్స్ కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నేడు విజయరాయి సెక్షన్ పరిధిలో..

పెదవేగి: మండలంలోని విజయరాయి సెక్షన్ పలు సబ్ స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఈఈ కేఎం అంబేడ్కర్ తెలిపారు. విజయరాయి, గాంధీ నగర్, జంగళవారిపేట ముత్తనవేడు గ్రామాలకు, రాయుడుపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని రాట్నాలగుంట, రాయుడుపాలెం, కొండలరావులపాలెం, లేల్లగూడెం గ్రామాలకు, విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు. బాపిరాజుగూడెం సబ్ స్టేషన్ పరిధిలోని బాపిరాజుగూడెం, రామచంద్రాపురం, నడిపల్లి, గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోండి

పెదవేగి : కిశోర బాలికలు సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని పెదపాడు ప్రాజెక్ట్ అదనపు సీడీపీఓ ఎం సునీల్ రాజశేఖర్ అన్నారు. పెదవేగి మండలం కూచింపూడిలో మే 2 నుంచి గ్రామ సచివాలయంలో కిశోరి వికాసం కార్యక్రమాలను గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న కిశోర బాలికలకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మే 2 నుంచి జూన్ 6 వరకు కిశోర బాలికలకు సమ్మర్ క్యాంప్స్ కింద కార్యక్రమాలను ప్రతి మంగళ, శుక్రవారాల్లో వారికి ఆరు సబ్జెక్టుల్లో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి ఎస్.ఎలిజబెత్ రాణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సీహెచ్ పార్వతి పాల్గొన్నారు.

సమస్యలపై పోరాటాలు

ఏలూరు (టూటౌన్): సీఐటీయూ ఐక్యత – పోరాటం అనే నినాదంతో దేశ వ్యాప్తంగా కార్మిక సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తోందని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ అన్నారు. సీఐటీయూ 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీఐటీయూ ఏలూరు జిల్లా కార్యాలయం అల్లూరు సత్యనారాయణ భవనం వద్ద సంఘం జెండాను జిల్లా అధ్యక్షుడు ఆర్ లింగరాజు ఆవిష్కరించారు.

4న వైఎస్సార్ సీపీ ఆందోళనలు



సమావేశంలో మాట్లాడుతున్న గంగరాజు

కొయ్యలగూడెం: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జూన్ 4వ తేదీ వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నామని దీనిని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తుమ్మలపల్లి గంగరాజు పేర్కొన్నారు. గంగవరంలో గ్రామ కన్వీనర్ కంచర్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మంతెన సోమరాజుతో కలిసి పాల్గొన్నారు. కూటమి పార్టీల మాటలు నమ్మి ప్రజలు మోసపోయారని అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నా సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. దీనికి నిరసనగా వెన్నుపోటు దినం నిర్వహించాల్సిందిగా వైఎస్సార్‌సీపీ అధిష్ఠానం పిలుపు ఇచ్చిందన్నారు. జిల్లా అధికార ప్రతినిధి దాసరి విష్ణు, రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి గంటా శ్రీను, పార్టీ నాయకులు బల్లే నాగేశ్వరరావు, పాముల నాగ మునిస్వామి, ఎంపీటీసీ చింతయ్య, ఆనందరావు, దూలపల్లి కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06–08
వంకాయలు (గులాబీ)	28	చిక్కుడు కాయలు	90
వంకాయలు (కాంతులు)	34	బిళ్లచిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	30	చామదుంపలు	50
బెండకాయలు	30	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	34	కంద	--
కాకర కాయలు	44	బీట్‌రూట్	36
బీరకాయలు	40	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	48	ఫ్రెంచ్‌బీన్స్	112
క్యాబేజీ	20	అల్లం	68
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	20	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	24	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07–10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	10–15	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	13
ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	28
ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	42
ఏలూరు – బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	09
ఏలూరు – అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	15
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.15	4822	19
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	14
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	17
ఏలూరు – జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	17
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	27
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	02
ఏలూరు – తిరుపతి	16.00	4830	34